అభివృద్ధి, సంక్షేమంలో రాజీపడని సీఎం

- సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు
- పేర్నమిట్టలో సిమెంట్ రోడ్డు పరిశీలన


సిమెంటు రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

చీమకుర్తి: ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం అందించడంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజీపడరని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు అన్నారు. పేర్నమిట్టలోని ఒంగోలు కార్పొరేషన్ 40వ డివిజన్‌లో రూ.35 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ఆదివారం ఎమ్మెల్యే పరిశీలించారు. నిరంతరం రోడ్లు, సైడు కాలువలు వంటి అభివృద్ధి పనులతో పాటు సంక్షేమ పథకాలు అందించడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచి రెడ్డి, స్థానిక కార్పొరేటర్ తేళ్ల చంద్రశేఖర్, నాయకుడు దుంపా యలమందారెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రోటరీక్లబ్ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల పంపిణీ


మట్టితో చేసిన వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు


మట్టివినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్న ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్

చీమకుర్తి: పర్యావరణానికి హాని కలగకుండా మట్టితో చేసిన వినాయక విగ్రహాలను రోటరీ క్లబ్ సభ్యులు ఆదివారం పంపిణీ చేశారు. చీమకుర్తిలోని రోటరీక్లబ్ బస్టాండ్ సెంటర్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. రసాయనిక పదార్థాలతో చేసిన వినాయక విగ్రహాలు వాడటం వలన కలిగే దుష్పరిణామాలను వివరిస్తూ మట్టితో చేసిన విగ్రహాలను మాత్రమే పూజలకు వినియోగించాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గుండా చిన వెంకటేశ్వర్లు, అంబటి వీరారెడ్డి, మన్నం నాగరాజు, పరాంకుశం శ్రీనివాసమూర్తి, గొల్లపూడి వెంకట్రావు, స్థానికులు పాల్గొన్నారు.

జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో...

ఒంగోలు: ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలను ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ ఆదివారం పంపిణీ చేశారు. స్థానిక ఆర్యవైశ్య భవన్ వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను దృష్టిలో ఉంచుకుని మట్టి వినాయక ప్రతిమలను వినియోగించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు రావూరి కాశీరంగ జనార్దన్, ప్రధాన కార్యదర్శి జలదంకి వెంకట కృష్ణారావు, కోశాధికారి కొత్తూరు రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో...

స్థానిక సీవీఎన్ రీడింగ్ రూము వద్ద ఉన్న ప్రైవేటు వస్త్ర దుకాణం వద్ద మట్టి వినాయక ప్రతిమలను ఒంగోలు ఫ్రెండ్స్ క్లబ్ సభ్యులు ఆదివారం ఉచితంగా పంపిణీ చేశారు. మొత్తం 8 వేల విగ్రహాలు తెప్పించి పంపిణీ ప్రక్రియను ప్రారంభించినట్లు క్లబ్ అధ్యక్షుడు తాతా బదరీనాథ్ తెలిపారు. సోమవారం ఉదయం వరకూ పంపిణీ చేస్తూనే ఉంటామన్నారు. పర్యావరణ హితాన్ని కాంక్షిస్తూ కొన్ని సంవత్సరాలుగా తాము ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యుడు కోడూరి కిషోర్‌కుమార్, గుర్రం బదరీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

శిద్దా సుధీర్‌కు ఆర్యవైశ్యుల ఘన సత్కారం


టీటీడీ బోర్డు మెంబర్ శిద్దా సుధీర్ దంపతులను సత్కరిస్తున్న ఆర్యవైశ్య, వాసవీ సంఘ నాయకులు

చీమకుర్తి: ఆర్యవైశ్య సంఘం, వాసవీ సంఘం ఆధ్వర్యంలో చీమకుర్తిలోని వాసవీ కళ్యాణ మండపంలో టీటీడీ పాలకమండలి సభ్యుడు శిద్దా సుధీర్‌కుమార్‌కు ఆదివారం ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్‌కుమార్ మాట్లాడుతూ టీటీడీలో సేవచేసుకునే భాగ్యం కల్పించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తనపై, తన కుటుంబ సభ్యులపై ఆర్యవైశ్యులు చూపిస్తున్న అభిమానం వెలకట్టలేనిదన్నారు. శిద్దా సుధీర్, శృతి దంపతులను, వారి తల్లిదండ్రులైన మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి దంపతులను ఆర్యవైశ్య సంఘం, వాసవీ సంఘం, వాసవీ మహిళా సంఘం సభ్యులు ఘనంగా సత్కరించారు. తొలుత ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కుప్పం ప్రసాద్, శిద్దా రాఘవరావు కుటుంబ సభ్యులు శిద్దా పాండురంగారావు, శిద్దా నాగేశ్వరరావు, ఆర్యవైశ్య సంఘ నాయకులు నూనె హేమసుందర్, చలువాది బదరీనారాయణ, డాక్టర్ బీ జవహర్, వైఎస్సార్ సీపీ అద్దంకి పరిశీలకుడు మారం వెంకారెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

కొత్తపట్నం తీరంలో వినాయక నిమజ్జనాలకు ఏర్పాట్లు

కొత్తపట్నం: వినాయక నిమజ్జనాలకు కొత్తపట్నం బీచ్‌లో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఒంగోలు, చుట్టుపక్కల గ్రామాల నుంచి సుమారు 500 వినాయక విగ్రహాలు నిమజ్జనానికి తీరానికి వస్తాయని పోలీసులు అంచనా వేస్తున్నారు. ఏటా 500 నుంచి 600 వినాయక విగ్రహాలను కొత్తపట్నం తీరంలో నిమజ్జనం చేస్తారు. ఈ ఏడాది కూడా అంతకంటే పెరిగే అవకాశం ఉందని పోలీస్ అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. లోతుకు వెళ్లకుండా అడ్డంగా కర్రలు, మైక్, లైట్లు ఏర్పాటు చేశారు. బోటును కూడా సిద్ధం చేశారు. సుమారు 30 వేల మంది భక్తులు నిమజ్జనానికి రానున్నట్లు అంచనా వేస్తున్నారు. ఆదివారం ఎస్సై సాంబశివరావు ఏర్పాట్లను పరిశీలించారు. మండలంలో అనుమతులు లేకుండా వినాయక విగ్రహాలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


కొత్తపట్నం తీరంలో బోట్లను పక్కకు పెట్టిస్తున్న ఎస్సై సాంబశివరావు

రాష్ట్రస్థాయి చదరంగ క్రీడాకారులు వీరే


రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ఒంగోలు: రాష్ట్రస్థాయి చదరంగ పోటీలకు జిల్లా నుంచి బాలుర విభాగంలో ముగ్గురిని, బాలికల విభాగంలో ముగ్గురిని ఎంపిక చేసినట్లు ప్రకాశం జిల్లా చెస్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్‌కే అబ్దుల్ నబీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 13 బాలబాలికల విభాగంలో స్థానిక రాజాపానగల్ రోడ్డులోని టాలెంట్ చెస్ అకాడమీలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలలో బాలుర విభాగంలో పి.జశ్వంత్, ఐ.రాహుల్‌కుమార్, కె.అఖిలేష్, బాలికల విభాగంలో ఈ.లాస్యప్రియ, శ్రీసుదీక్ష, శ్రీసాయిస్రిస్ట రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో సంపూర్ణ ఆరోగ్యం

- పెళ్లూరులో ఇంటింటి సర్వేలో పాల్గొన్న నగర కమిషనర్ వెంకటేశ్వరరావు


ఇంటింటి సర్వేలో పాల్గొన్న కమిషనర్ వెంకటేశ్వరరావు, 17వ డివిజన్ కార్పొరేటర్ వెంకట శేషయ్య

ఒంగోలు సబర్బన్: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకంతో ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో భాగంగా ఒంగోలు నగరంలో ఆదివారం ఇంటింటి సర్వే చేపట్టారు. నగరంలోని అన్ని వార్డు సచివాలయాల పరిధిలో సర్వే చేశారు. 17వ డివిజన్ పరిధిలోని పెళ్లూరులో నిర్వహించిన సర్వేలో కమిషనర్ పాల్గొని మాట్లాడారు. ఈ సర్వేల్లో రిమ్స్ మెడికల్ కాలేజీ ఎంబీబీఎస్ విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు కూడా పాల్గొంటున్నారన్నారు. కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు ఈ నెల 15వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో భాగంగా ఇంటింటి సర్వే చేపట్టామన్నారు. అందులో భాగంగా ప్రతి వార్డు సచివాలయం పరిధిలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి హెల్త్ సర్వే చేపట్టి ప్రతి ఇంట్లో ప్రజల అనారోగ్యాలకు సంబంధించిన వివరాలను రికార్డు చేస్తున్నారన్నారు. ప్రతి ఇంట్లోని వారికి ఏమైనా ఆరోగ్య సమస్యలుంటే ఇంటి వద్దే పరీక్షలు కూడా నిర్వహిస్తారన్నారు. పరీక్షల్లో భాగంగా బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, యూరిన్, కఫం పరీక్షలతో పాటు జ్వరంతో బాధపడుతున్న వారికి మలేరియా, డెంగీతో పాటు మొత్తం ఏడు రకాల పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఏఎన్ఎంలు ఇంటి వద్ద చేపట్టే వైద్య పరీక్షల గురించి ప్రజలకు వివరించారు. తద్వారా ఇంటింటి ఆరోగ్య సర్వేలో ఎలాంటి ఆరోగ్య సమస్యలున్నా సెప్టెంబర్ 30వ తేదీ నుంచి సచివాలయాల వారీగా నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకం క్యాంపులకు తీసుకొచ్చి డాక్టర్ల ద్వారా వైద్య పరీక్షలు చేయిస్తామని వెల్లడించారు. వారి అనారోగ్య పరిస్థితులను బట్టి మందులు ఇవ్వడం, లేదంటే ఉన్నత వైద్య పరీక్షలకు పంపడం లాంటివి చేస్తామన్నారు. కార్యక్రమంలో 17వ డివిజన్ కార్పొరేటర్ నాగం వెంకట శేషయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లు సకాలంలో పనులు పూర్తి చేయాలి

ఒంగోలు నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను కాంట్రాక్టర్లు, ఇంజినీరింగ్ అధికారులు సకాలంలో పూర్తి చేయాలని కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు ఆదేశించారు. స్థానిక భాగ్యనగర్‌లో ఆదివారం కమిషనర్ పర్యటించి నిర్మాణంలో ఉన్న రోడ్లు, కాలువలను పరిశీలించారు. అభివృద్ధి పనుల పురోగతి, ఇంకా ప్రారంభం కాని పనులపై ఇంజినీరింగ్ అధికారుల నుంచి సమాచారం సేకరించారు. నగరంలో రోడ్లు, కాలువల నిర్మాణ పనులు, మరమ్మతులపై ప్రతి వారం సీడీఎంఏ వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షిస్తున్నారని వెల్లడించారు. కాంట్రాక్టర్లందరూ వారికి వచ్చిన పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. భాగ్యనగర్ ఒకటో లైన్ నుంచి నాలుగో లైన్ వరకు పారిశుధ్య పనులను, చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. 20వ డివిజన్ కార్పొరేటర్ పసుపులేటి విజయలక్ష్మి భర్త శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రకటన

నాక్లైంటు కాట్రగడ్డ ఉదయశంకర్ S/o. శేషయ్య అమ్మనబ్రోలు పంచాయతి చవటపాలెం గ్రామం అనువారి సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయునది.

నాక్లైంటు క్రింది షెడ్యూలు దాఖల ఆస్తిని పచ్చిశెట్టి వనజాక్షమ్మ గారి నుండి కొనుగోలు చేయదలచినాడు ఎవరికి ఎటువంటి అభ్యంతరములు ఉన్న క్రింది అడ్రస్‌కు తెలుపవలెనని తెలియడమైనది.

షెడ్యూలు: ప్రకాశం జిల్లా, S.N.Padu మండలం పేర్నమిట్ట గ్రామం - Sy.No. 158/ 1,2 - విస్తీర్ణము Ac. 0.26 1/2 Out of Ac.1.26 1/2 ఆస్తికి హద్దులు. **తూర్పు:** వనజాక్షమ్మ విక్రయించిన భూమి, **దక్షిణం:** ఎం.వెంకటేశ్వర్లు విక్రయించిన భూమి, **పడమర:** పి.అంజనేయులు, **ఉత్తరం:** రోడ్డు.

Ongole Dt.18.09.2023 — R.V.S. BHARADWAJA, Advocate, Ongole. Cell: 94937 81705.

క్లుప్తంగా

ఘనంగా విశ్వకర్మ జయంతి


విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేస్తున్న జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి మంజుల

ఒంగోలు: భగవాన్ విశ్వకర్మ జయంతి సందర్భంగా స్థానిక ప్రగతిభవన్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విశ్వకర్మ జయంతి ప్రాశస్త్యం గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి ఎం.అంజల, గిరిజన సంక్షేమశాఖ అధికారి జగన్నాథరావు, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గోనుగుంట రజిని, రిటైర్డ్ తహసీల్దారు శోభిరాల సుబ్బారావు, ఆదిమూలం సుబ్బారావు, సుతారం శ్రీనివాసరావు, నూతలపాటి వెంకట శేషాచారి, గోనుగుంట మోహన కృష్ణమాచార్యులు పాల్గొని విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేశారు.

మోదీ పుట్టినరోజు సందర్భంగా బైక్ ర్యాలీ


మోదీ ప్రవేశపెడుతున్న కార్యక్రమాన్ని ఆన్‌లైన్‌లో వీక్షిస్తున్న బీజేపీ శ్రేణులు

ఒంగోలు: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పుట్టిన రోజును పురస్కరించుకుని బీజేపీ నాయకులు ఆదివారం నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. విశ్వకర్మ జయంతి కూడా కావడంతో 18 రకాల చేతివృత్తుల వారికి పనిముట్లతో కలిపి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన విశ్వకర్మ కౌసల్య యోజన కార్యక్రమాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి, తదితరులు వివిధ రకాల చేతివృత్తుల వారితో కలిసి విష్ణుప్రియ ఫంక్షన్ హాలులో వీక్షించారు. అనంతరం పథకం లక్షణాలు, వాటిని పొందేందుకు అర్హతలు, తదితరాలపై అవగాహన కల్పించారు.

ప్రతి సెంటు భూమిలో ప్రకృతి వ్యవసాయం చేయాలి


రైతులకు ఘనజీవామృతం చేసి చూపిస్తున్న నరసింహులు, వెంకటేశ్వరరెడ్డి

మదనూరు (కొత్తపట్నం): ప్రతి సెంటు భూమిలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేయాలని మాస్టర్ ట్రైనర్ నరసింహులు కోరారు. మండలంలోని మడనూరు గ్రామంలో రైతు సాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనజీవామృతం తయారు చేసి రైతులకు అవగాహన కల్పించారు. 400 కేజీల దేశీ ఆవుపేడతో ఘనజీవామృతం తయారు చేసే పద్ధతి గురించి రైతులకు వివరించారు.

21న మినీ జాబ్ మేళా

ఒంగోలు సబర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్, ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలు సంయుక్తంగా మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు నైపుణ్య అభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఆర్.లోకనాథం తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఈ నెల 21వ తేదీ మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక పాత గుంటూరు రోడ్డులోని ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాల ప్రాంగణంలో ఆ రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 3 గంటల వరకు మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ, డిప్లొమో, బీ.టెక్‌తో పాటు ఆ పైన ఉన్నత విద్యార్హతలు కలిగిన యువతీ, యువకులు ఇంటర్వ్యూకు హాజరు కావచ్చన్నారు. ఆధార్, పాన్ కార్డు, ఇతర విద్యార్హతలతో కూడిన సర్టిఫికెట్లు తీసుకొని రావాలని విజ్ఞప్తి చేశారు. శుభమస్తు షాపింగ్ మాల్ ప్రైవేట్ లిమిటెడ్, పీఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్, వరుణ్ మోటార్స్, సీఎంఆర్ ఎకో అల్యూమినియం ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల్లో పని చేసేందుకు ఈ మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా సంస్థల్లో సేల్స్ మెన్, సేల్స్ ఉమెన్, క్యాషియర్, హెల్పర్స్, క్యాడ్ ఆపరేటర్స్, సైట్ ఇంజినీర్స్, అసిస్టెంట్ టెక్నీషియన్స్, టెక్నీషియన్స్, ఐటీఐ ఫిట్టర్స్, ఎలక్ట్రీషియన్స్, సెక్యూరిటీ గార్డ్స్ ఖాళీలను భర్తీ చేయటానికి ఈ మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఇంటర్వ్యూలలో ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు జీతం ఇస్తారన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పూర్తి వివరాల కోసం ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ లేదా 79892 44381, 99888 53335 ఫోన్ నంబర్లను సంప్రదించాలని ఆర్.లోకనాథం సూచించారు.